క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన జగదీశ్వర్‌గుప్తా



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జగదీశ్వర్‌గుప్తా, కుటుంబ సభ్యులు

సిద్దిపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తాడేపల్లిగూడెంలోని స్వగృహంలో జగదీశ్వర్ గుప్తా దంపతులు, కుటుంబ సభ్యులతో కలిశారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

హుస్నాబాద్: వంద రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా 100వ రోజు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్మికులు తడి, పొడి చెత్త బుట్టలను పట్టుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్త సేకరించే వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ... పట్టణ ప్రజలు ఇంటి వద్దనే చెత్త వేరు చేసి అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ సంపత్ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఆర్‌పి ప్రసాద్, పర్యావరణ అధికారి రవికుమార్, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పితే అనంతలోకాలకే..



దేవేంద్రనగర్‌కు వెళ్లే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బండరాళ్లు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని దేవేంద్రనగర్‌కు వెళ్లే రోడ్డుకు రెండు పక్కలా బండరాళ్లు ప్రమాదకరంగా ఉండటంతో గ్రామస్తులు తెల్లటి రంగులతో హెచ్చరిక చిత్రాలు వేశారు. రోడ్డు పాము లెక్కన వంకర్లు తిరగడం, పక్కనే బండరాళ్లు ప్రమాదకరంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన బండరాళ్లను తొలగించాలని కోరుతున్నారు.

యూరియాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): యూరియాపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను బీఆర్ఎస్ నాయకులు ఆగం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి సరిపడా యూరియా రావడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు యూరియా వచ్చిందంటూ రైతులను మోసగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. యూరియా పేరుతో రైతులను రోడ్డెక్కిస్తున్నారన్నారు. నాయకులు రాజేశ్, పర్శరాములు, వెంకట్, భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



పట్టణంలోని కోమటి చెరువు వద్ద పట్టపగలే విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. వినాయక నిమజ్జనం పూర్తయి మూడు రోజులు కావస్తున్నా మున్సిపల్, విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం వెలుగుతూనే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. కరెంట్ వృథా అవుతుందని లైట్లను ఆఫ్ చేయాలని కోరుతున్నారు.

– సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్,సిద్దిపేట

కరిగిపోతున్న గుట్టలు

- జోరుగా మట్టి మాఫియా
- పట్టించుకోని అధికారులు



గోనెపల్లి శివారులో మట్టి తవ్వకాలు

చిన్నకోదూరు(సిద్దిపేట): మట్టి మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రకృతి వనరులను యథేచ్ఛగా దోచేస్తున్నారు. అనుమతులు లేకున్నా నిబంధనలు మట్టిలో తొక్కి గుట్టలను చెరబడుతున్నారు. కళ్లెదుటే ప్రకృతి సంపద అంతరించిపోతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని అనంతసాగర్, మేడిపల్లి, గోనెపల్లి గ్రామాల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని కాజేస్తున్నారు. మట్టిని తరలిస్తూ అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ లక్షలు సంపాదిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. దీంతో మునుముందు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయి. మట్టిని భారీ వాహనాల్లో తరలిస్తుండటంతో పలు గ్రామాల్లో బీటీ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సలీమ్‌ను అడగగా.. అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి పనికి మట్టి తీసుకెళ్లినా అనుమతులు తీసుకోవాలని చెప్పారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): సీఎం సహాయనిధి పేదలకు వరమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 నెలలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని రహదారులు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మంత్రి సీతక్కను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, తహసీల్దార్ ఆరీఫ్, ఎంపీడీవో రామ్మోహన్, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే పట్టు సులభం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా. వినోద్ కుమార్

చిన్నకోదూరు(సిద్దిపేట): పట్టు పురుగుల పెంపకంలో రైతులు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు డా.వినోద్ కుమార్, డా.రాఘువేందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లిలో పట్టు సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చిరొట్ట, పశువుల పేడ తదితర సేంద్రియ ఎరువులు వేయడం వల్ల ఆకు నాణ్యతగా వస్తుందన్నారు. మల్బరీ తోటకు పొలపురుగు, సున్నంకట్టు రోగం, నాన్ స్పిన్నింగ్, తదితర రోగాలు రాకుండా ఎలాంటి మందులు వాడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఏడీ ఇంద్రసేనారెడ్డి, జిల్లా అధికారి శర్మ, పట్టు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

కాళోజీ సేవలు చిరస్మరణీయం



చిన్నకోదూరు(సిద్దిపేట): అనంతసాగర్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు



సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చిన్నకోదూరు(సిద్దిపేట): ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మున్సిపల్ కార్యాలయంలో నారాయణ రావు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమ గొంతుక

సిద్దిపేట ఎడ్యుకేషన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ తొలి పొద్దు, ప్రజాకవి తెలంగాణ ఉద్యమ గొంతుక కాళోజీ నారాయణరావు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్య రెడ్డి అన్నారు. డిగ్రీ కళాశాల (అటానమస్) సిద్దిపేటలో, ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దాసు, డాక్టర్ సీహెచ్ మధుసూదన్, డాక్టర్ గోపాల సుదర్శనం, వెంకటరమణ, నరేశ్, శైలజ, రామస్వామి, చక్ర హరి, రమణ, సాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జాసాప అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, బస్వరాజ్ కుమార్, పర్శరాములు కాళోజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కాళోజీకి ఘన నివాళి

దుబ్బాకటౌన్ / దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళశాల, దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ రమేశ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.భవానీ, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాలలో..

దౌల్తాబాద్ (దుబ్బాక): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, తెలుగు భాషా ఉపాధ్యాయులు నరేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, పద్య పదరచన, గేయాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుకునూర్‌పల్లి మండలంలోని రాయవరం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం మంగళవారం పది గంటలు దాటినా తీయలేదు. ఇక్కడ పనిచేసే టీచర్, ఆయా కూడా పదవీ విరమణ పొందడంతో, కేంద్రం బాధ్యతలు అనంతసాగర్ అంగన్‌వాడీ కేంద్రానికి అప్పగించారు. కేంద్రం తెరవకపోవడంతో అంగన్‌వాడీకి వచ్చే పిల్లల తల్లులు చూసి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. పూర్తిస్థాయిలో ఇన్‌చార్జిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల నుంచి సూపర్‌వైజర్ల ద్వారా రూ.10వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేసి కాంట్రాక్టర్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ జీవో ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలి, కానీ కేవలం రూ. 11వేలు మాత్రమే ఇస్తున్నారని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయడం లేదన్నారు.

కాంగ్రెస్ వల్లే యూరియా కొరత

ప్రభుత్వం, సీఎం దిష్టిబొమ్మల దహనం



అక్కన్నపేట(హుస్నాబాద్): అంబేద్కర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర మంత్రులు, బడా నాయకుల పరిశ్రమలకు యూరియా మళ్లింపుతోనే రైతులకు కొరత ఏర్పడిందని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వెంకటేశం ఆరోపించారు. మంగళవారం ప్రభుత్వ, సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కొరత కాంగ్రెస్ సృష్టించిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకున్నదన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రమేశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రజనీకాంత్‌రెడ్డి, సరేందర్‌రెడ్డి, దామోదర్, తిరుపతి, సతీశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతుల గోస కనిపిస్తలేదా?

అక్కన్నపేట(హుస్నాబాద్): యూరియా కోసం రైతులు పడుతున్న గోస ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మర్రిచెట్టు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో చేసి, దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ జనగామ వేణుగోపాల్ రావు, నాయకులు సంపత్, రవికుమార్,మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి. శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కూల్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రూ. 8500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు బకాయిలు పేరుకుపోయాయన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాహుల్, సునీల్ పాల్గొన్నారు.

బోధనలో టీఎల్ఎంను వినియోగించాలి



ప్రదర్శనను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బోధనలో టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ను విరివిగా వినియోగించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ మేళాను సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంలు ఆకర్షణీయంగా ఉన్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రాథమిక విద్య పటిష్టంగా ఉండటం వల్ల విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. మేళాలో 299 టీఎల్ఎంలను ప్రదర్శించారని, ప్రతి సబ్జెక్ట్ నుండి రెండు ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి రమేశ్, విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

సిద్దిపేటరూరల్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈలు, ఏఈలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు.

మత్తుతో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: జీవితంలో ఎంతో సాధించాల్సిన వారు యుక్త వయస్సులో మత్తుకు బానిసై జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ , రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం నేర్చుకోవాలన్నారు. కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలని సూచించారు. అంతకుముందు పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ మొక్కను నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షహనాజ్ సుల్తానా, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

- ఏక్‌పేడ్ మాకేనామ్‌లో భాగంగా..
- మొక్కలు నాటిన అధికారులు

ఏక్‌పేడ్ మాకేనామ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఒక్కో ఉద్యోగి ఒక మొక్క నాటారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పోలీసులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాటిన మొక్కలను సంరక్షించాలని వక్తలు పేర్కొన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించాలంటే ఇప్పటి నుంచే అమ్మ పేరు మీద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ స్ఫూర్తితో మొక్కలు నాటుతూ అమ్మను గౌరవించుకోవాలన్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట) కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు



చిన్నకోదూరు(సిద్దిపేట): చిన్నకోదూరులో మొక్కలు నాటుతున్న అధికారులు



వర్గల్(గజ్వేల్): వర్గల్ గురుకులంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు



చేర్యాల(సిద్దిపేట): మొక్క నాటుతున్న సీఐ శ్రీనుతో ఎస్ఐ నవీన్,కమిషనర్ నాగేందర్



కోహెడ(హుస్నాబాద్):కోహెడ పోలీస్‌స్టేషన్ అవరణలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ అభిలాష్



(సిద్దిపేటజోన్) : మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



దుబ్బాక: దుబ్బాకలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

◆ **మంత్రి దృష్టికి తీసుకెళతా..**

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిమ్మాపూర్‌లో సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలోని మురికి కాల్వలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సత్యనారాయణ, శ్రీశైలం పాల్గొన్నారు.

◆ **యూరియా సరఫరాలో కాంగ్రెస్ విఫలం**

హుస్నాబాద్: రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 11 ఏళ్లుగా ఎప్పుడు లేని యూరియా కొరత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కృత్రిమ కొరత సృష్టించారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు నాగార్జున్, వెంకటేశ్, రాజేందర్, సాయిరాం ఉన్నారు.

◆ **చెడు వ్యసనాలకు బానిస కావద్దు**

దుబ్బాకటౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యులు శ్రీనివాస్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. వైద్య శిబిరం నిర్వహించడానికి సహకరించిన స్వామి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **బీమా చేయించుకోవాలి**

తొగుట(దుబ్బాక): ఖాతాదారులు బీమా చేయించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు తొగుట బ్రాంచ్ మేనేజర్ జలంధర్ కోరారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సచ్చిరేషన్ క్యాంపు మంగళవారం జప్తిలింగారెడ్డిపల్లిలో నిర్వహించారు. గ్రామానికి చెందిన కడారి శ్రీశైలం పిడుగుపాటుకు గురై మృతిచెందగా ఆయన భార్య తారకు రూ.20లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కనకయ్య, పంచాయతీ కార్యదర్శి వేలాద్రి, మాజీ సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

◆ **ఇంటింటికీ బీజేపీ**

చేర్యాల(సిద్దిపేట): సంపర్క్ అభియాన్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కడవేర్గులో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులుగౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన నాయకులు ప్రధాని మోదీ పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమపథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, పట్టణాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు రాందాసు, సత్యవర్ధన్, బాలరాజు, శ్రీనివాసరావు, గోపాల్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, బాబు, సిద్ధిలింగం, సత్యనారాయణ, యాదగిరి, రవి, వినయ్, లక్ష్మీపతి పాల్గొన్నారు.